సాక్షి
మంచిర్యాల
శనివారం । 13 । జూలై । 2024



మొక్కలు భలే చౌక

ఐటీడీఏ ఆధ్వర్యంలో మామిడి, పూల మొక్కలు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నర్సరీల్లో పెంపకం చేపట్టారు. నాలుగు చోట్ల విక్రయానికి అందుబాటులో ఉంచారు. 8లో▸



ప్రతీ శుక్రవారం డ్రై డే 9లో▸

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లు సూచించారు. శుక్రవారం పలు చోట్ల ఫ్రైడే డ్రైడే నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

వైద్యం.. పారదర్శకం..!

- రంగంలోకి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు బృందం
- ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌లలో తనిఖీలు
- వైద్యులు, సిబ్బంది, ఫీజుల వివరాల ప్రదర్శనకు సూచన
- నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు



మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో పరిశీలిస్తున్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ టీం సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పారదర్శకంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఫీజుల వివరాలు, మౌలిక వసతులు ఉన్నాయో లేదో పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు–2010 ప్రకారం జిల్లాకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసింది. ఈ బృందానికి రాష్ట్ర సంయుక్త సంచాలకులు(జేడీ) స్థాయి అధికారి డాక్టర్ రాజేశంను నియమించారు. ఇటీవల జిల్లాలో రెండు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసి నిబంధనల మేరకు ఉన్నట్లు గుర్తించారు. ఫీజుల వివరాలు, వైద్యులు, వైద్య సిబ్బంది పేర్లు ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగికి కనిపించేలా బోర్డుపై రాయాలని సూచించారు. ప్రతీ నెల టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు పరిశీలించనున్నారు. జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌వో, జిల్లా మాస్ మీడియా అధికారి, సూపరింటెండెంట్లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు అమలయ్యేలా చూస్తారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతుల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వైద్యంతో సంబంధం లేని వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర వ్యాపారులు ఇష్టారీతిన ఆస్పత్రులు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పేరిట అడ్డగోలుగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభోత్సవాల సమయంలో అన్ని రకాల వైద్య సేవలు అందించే వైద్యుల పేర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తున్నా కొద్ది రోజుల్లోనే ఆయా వైద్యులు ఆస్పత్రులను వదిలి వెళ్తున్నారు. వైద్యులు లేకపోయినా గతంలో పని చేసిన వైద్యుల పేర్లతోనే ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఆర్‌ఎంపీల సహాయంతో ఆస్పత్రులకు రోగులను రప్పించుకుని అందుబాటులో ఉండే వైద్యులతో, పిలిపించి చికిత్స చేయిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతంలో తనిఖీలు చేయగా కొందరికి నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తనిఖీ చేసి అనుమతి ఇస్తే టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. ప్రస్తుతం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్నింటినీ తనిఖీ చేయాలని ఇచ్చిన ఆదేశాలతో ఎన్ని బోగస్ ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయో బయటపడే అవకాశం ఉంది.

ప్రజలకు తెలిసేలా బోర్డులు

జిల్లాలో అనుమతి పొందిన ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌లు 245 ఉండగా, 12 ఆసుపత్రులు ఆయుష్ కింద నమోదయ్యాయి. వీటిలో కొన్నింటిలోనే పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సేవలు అందుతున్నాయి. 50శాతానికి పైగా నిబంధనల మేరకు నిర్వహించడం లేదని సమాచారం. ప్రైవేటు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్న సమయంలో ఉండే వైద్యులు, వైద్య సిబ్బంది కొన్ని నెలల్లోనే మారిపోతున్నారు. అయినా వారి పేర్లతోనే ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. అర్హతలు లేకుండానే స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతుండడంతో బోగస్ వాటి వివరాలు సేకరించి నోటీసులు అందించేలా ఏర్పాటు చేస్తున్నారు. చట్ట ప్రకారం ఏ ప్రైవేటు ఆస్పత్రి అయినా ఆస్పత్రి యజమాని పేరు, వైద్యులు, ప్రత్యేక వైద్యుల పేర్లు, వారి ఫీజుల వివరాలు, వైద్య సిబ్బంది పేర్లు, ఇతరత్రా ఫీజుల వివరాలన్నీ రోగులకు కనిపించేలా, తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వైద్యులు, సిబ్బంది వెళ్లిపోతే వారి స్థానంలో వచ్చే వారి ధ్రువీకరణ పత్రాలను వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందించి వారి పేర్లను ఆయా బోర్డులపై రాయాల్సి ఉంటుంది. వీటితోపాటు ఫైర్‌సేఫ్టీ, బయోవేస్టేజ్, ఫార్మసి రిజిస్ట్రేషన్, ల్యాబ్ ఎంఎల్‌టీ అర్హత, స్కానింగ్ కేంద్రాల్లో అర్హత ఉన్నవారితోనే నిర్వహణ వంటివి చేపట్టాల్సి ఉండగా.. లేనిపక్షంలో నోటీసులు ఇస్తారు. వారం రోజుల్లో సరి చేసుకోకుంటే చర్యలు తీసుకుంటారు. ఒక రోగి తనకు వచ్చిన వ్యాధికి చికిత్స తీసుకునేందుకు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఆ రోగికి ఎంత ఖర్చువుతుందనే విషయం తెలియాలనే ఈ చట్టం అమలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులకే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకూ వర్తింపజేస్తున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, జిల్లా ఆస్పత్రులకు కూడా డీఎంహెచ్‌వో నుంచి అనుమతి ఇస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది, బయోవేస్టేజ్, ఫైర్‌సేఫ్టీ, సర్వీసులు, క్లీనింగ్ ఎవరు చేస్తున్నారనే వివరాలు ప్రదర్శించాల్సి ఉంటుంది.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

మంచిర్యాలఅర్బన్: ఆదాయం రాబట్టుకునేందుకు ఆర్టీసీ పలు మార్గాలను అన్వేషిస్తోంది. నష్టాల నుంచి గట్టెక్కేందుకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ప్రయాణికుల విన్నపాల మేరకు అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు నడపనుంది. వచ్చే పౌర్ణమికి మంచిర్యాల డిపో నుంచి తమిళనాడులోని ప్రసిద్ధ శైవక్షేత్రం అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనుంది. ఈ నెల 19న బస్సు బయల్దేరి 22న మంచిర్యాలకు చేరుకుంటుంది. 19న మధ్యాహ్నం 2గంటలకు బస్సు బయల్దేరి 20న ఉదయం 6.30గంటలకు వరహసిద్ధి వినాయక టెంపుల్ కాణిపాకం చేరుకుంటుంది. అనంతరం తమిళనాడులోని వెళ్లూర్ లక్ష్మీదేవి, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత అరుణాచలానికి చేరుతుంది. 20న అక్కడ బస చేసి 21న గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం తర్వాత మధ్యాహ్నం 3గంటలకు తిరుగు ప్రయాణం అవుతుంది. 22న శక్తి పీఠం గద్వాల జోగులాంబ అమ్మవారి దర్శనం, సాయంత్రం 7గంటలకు మంచిర్యాలకు చేరుతుంది. పెద్దలకు టికెట్ చార్జీ రానుపోను రూ.5వేలు, చిన్నవారికి రూ.3200గా నిర్ణయించారు. భక్తులు మంచిర్యాల బస్టాండ్‌లో, www.tsrtconline.in లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు డిపోలో సంప్రదించాలని డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.

10శాతం రాయితీ

మంచిర్యాల నుంచి హైదరాబాద్, మియాపూర్ సూపర్‌లగ్జరీ, లహరి, రాజధాని సర్వీసుల్లో ఒకేసారి రానుపోనూ టికెట్ బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణంలో 10శాతం రాయితీ సౌకర్యం కల్పించినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీలో ప్రయాణం చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: ధరణితోపాటు వివిధ సమస్యలపై మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి వచ్చే ప్రజల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ధరణి పోర్టల్‌లో వివిధ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని సమస్యలతోపాటు కోర్టులో పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆర్డీవో వి.రాములు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో డీఈవో యాదయ్య, రోడ్లు–భవనాల శాఖ ఈఈతో కలిసి మండల విద్యాధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు తరగతి గదులతోపాటు బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ముగిసిన బదిలీల ఆప్షన్ గడువు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించిన ఆప్షన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు తొమ్మిది మంది, రెండేళ్లు పూర్తి చేసుకున్న ఒకరు బదిలీకి ఆప్షన్ ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈ స్వామి, ఏఈ టెక్నికల్ మధు, హెల్త్ అసిస్టెంట్లు సునిల్, వైకుంఠం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాం, మున్సిపల్ ఆర్‌ఐ మజార్, సీనియర్ అసిస్టెంట్ శ్రావిశ, జూనియర్ అసిస్టెంట్లు విమల, కిష్టయ్య, రాజమణి బదిలీ కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చుకున్నారు.

‘అక్రమ అరెస్టులపై మావోయిస్టు పార్టీ ఖండన’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్రంలో గత రెండ్రోజులుగా జరుగుతున్న అక్రమ అరెస్టులు, రచయిత, సామాజిక కార్యకర్త మహ్మద్ హుస్సేన్ అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. సికాస వ్యవస్థాపక సభ్యుల్లో కామ్రేడ్ హుస్సేన్ ఒకరని, ఆయన వివిధ స్థాయిలో పని చేసి అరెస్టు నాటికి రాష్ట్ర కమిటీ సభ్యుడని, సుదీర్ఘ జైలు జీవితం అనుభవించి ఆపై తన స్వగ్రామం జమ్మికుంటలో రచయితగా, సామాజిక కార్యకర్తగా జీవనం సాగిస్తున్నాడని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 73ఏళ్ల వయోవృద్ధుడిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. రామగుండం సీపీ సింగరేణి కార్మికుల్లో భయాందోళనలు సృష్టించడానికి మహ్మద్ హుస్సేన్‌ను జమ్మికుంటలో అరెస్టు చేసి సికాస నాయకుడు రమాకాంత్‌ను అరెస్టు చేశామని ప్రకటించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలో భాగంగా సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు కిషన్‌రెడ్డికి మంత్రి పదవి అప్పగించిందని విమర్శించారు. కార్మికులను మోసం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి మొసలికన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు.

అస్నాద పోడు భూముల సమస్య పరిష్కారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చెన్నూర్: మండలంలోని అస్నాద గ్రామస్తుల పోడు భూములపై ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం రాత్రి స్థానిక ఎఫ్‌డీవో కార్యాలయంలో ఫారెస్టు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గ్రామస్తులతో మాట్లాడారు. గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో ఫారెస్టు అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయరని, కొత్త స్థలాలకు జోలికి వెళ్లొద్దని సూచించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లులపై క్యూఆర్ కోడ్

- త్వరలో నూతన విధానం అమలు..
- ప్రస్తుత చెల్లింపులు నేరుగా లేదా డిస్కం సైట్లలోనే..



దండేపల్లి: ఆన్‌లైన్‌లో వివిధ యాప్(గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్)ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు కుదరని రిజర్వు బ్యాంకు నిబంధన విధించింది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఇక నుంచి డిస్కంకు సంబంధించిన వెబ్‌సైట్లు, యాప్ ద్వారా లేదంటే కార్యాలయాల్లో నేరుగా బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానం చాలా రోజుల నుంచే మనుగడలో ఉంది. జిల్లాలో 2,62,852 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. బిల్లుల చెల్లింపులకు కార్యాలయాలకు వెళ్లడం, అక్కడ వేచి ఉండాల్సి రావడంతో చాలామంది ఫోన్‌యాప్‌ల ద్వారా ఇన్ని రోజులు సులువుగా చెల్లించేవారు. ఇప్పటివరకు చాలామంది ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. ఆర్‌బీఐ తాజా నిబంధనలతో ఫోన్ యాప్‌ల ద్వారా చెల్లింపులు ఈ నెల ఒకటి నుంచి నిలిచిపోయాయి. డిజిటల్ చెల్లింపులకు అలవాటు పడిన వారికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను త్వరలో ముద్రించనున్నాయి. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ చెల్లింపులు త్వరలో అందుబాటులోకి వస్తాయని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

డిస్కం యాప్..

థర్డ్‌పార్టీ యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేయడంతో వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు పడకుండా టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్‌డెస్క్, యాప్ ద్వారా బిల్లు కట్టవచ్చు. ప్లే స్టోర్ నుంచి టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. పే బిల్‌లోకి వెళ్లి యూఎస్‌సీ నంబరు నమోదు చేశాక క్రెడిట్, డెబిట్ కార్డు, యూపీఐ యాప్‌లు, వ్యాలెట్ నుంచి చెల్లించవచ్చు. ఈ యాప్‌లో చెల్లించేటప్పుడు జీ పే, ఫోన్ పే, పేటీఎం యాప్‌లు అందుబాటులో ఉంటే వాటినీ వినియోగించుకోవచ్చు.

త్వరలో పూర్తి వివరాలు..

రాబోయే రోజుల్లో మీటర్ వద్ద రీడింగ్ తీసేటప్పుడు వినియోగదారుల పూర్తి వివరాలు యూఎస్‌సీ నంబర్, మీటరు నంబర్, బిల్లు వివరాలు క్యూఆర్‌కోడ్‌లో ముద్రిస్తారు. వినియోగదారుడు క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు నేరుగా బిల్లు చెల్లించే అవకాశం ఉంటుంది. ఈ విధానం త్వరలో అమల్లోకి వస్తుందని మంచిర్యాల విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్ తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాం



చెన్నూర్‌లో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

జైపూర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 39మందికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామితో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు, చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంతోషం చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆర్వోబీ రోడ్డు ప్రారంభం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రూ.22.9కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ని ఎంపీ వంశీకృష్ణ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే ఆర్వోబీపై లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై వారి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తీరనున్న కరెంట్ సమస్య

చెన్నూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభంతో చెన్నూర్ మున్సిపాలిటీలో కరెంట్ సమస్య తీరుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. చెన్నూర్ పట్టణంలో రూ.1.60 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, వైస్ చైర్మన్ నవాజ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

భీమారం: మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించిన మత్స్య పారిశ్రామిక సొసైటీ భవనాన్ని ఎంపీ వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపల పెంపకం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గొల్లవాగుప్రాజెక్ట్ మత్తడి నుంచి చేపపిల్లలు వెళ్లకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనేది అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. సొసైటీ భవనంలో బోరు బావి, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. మత్స్యశాఖ జిల్లా అధికారి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పాడేటి రవి, కొత్త సత్తిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాగన్ల మరమ్మతులు పూర్తి చేయాలి

- డీఆర్‌ఎం భరత్‌కుమార్‌జైన్
- రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



ఆర్‌వోహెచ్ డిపో షెడ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

బెల్లంపల్లి: రైల్వే వ్యాగన్ల మరమ్మతు పనులు సత్వరంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) భరత్‌కుమార్ జైన్ రైల్వే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ పరిధిలోని ఆర్వోహెచ్ డిపో షెడ్, రన్నింగ్ రూమ్, సీ అండ్ డబ్ల్యూ విభాగాలు, కొత్తగా చేపట్టిన సిక్ లైన్ షెడ్ విస్తరణ పనులు పరిశీలించారు. అక్కడి నుంచి ఆర్‌ఓహెచ్ డిపోకు వెళ్లారు. మరమ్మతులకు వచ్చిన వ్యాగన్లను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ నిర్ణీత సమయంలో వ్యాగన్ల మరమ్మతులకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సీనియర్ డీవోఎం సురేశ్, డీసీఎం బాలకృష్ణ, సీనియర్ డీఎస్టీ ప్రియా అగర్వాల్, ఏడీఈ ఎస్‌ఏ గోపి, రైల్వే కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

రైల్వే కార్మికుల ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఎం భరత్ కుమార్‌జైన్‌ను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు కోరారు. బెల్లంపల్లిలోని రైల్వే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విస్తృత పరిచి రైల్వే కార్మికులు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని, రైల్వే కార్మికులకు కొత్తగా క్వార్టర్లు నిర్మించాలని, పాత క్వార్టర్లకు మరమ్మతులు చేపట్టాలని, రైల్వే కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెక్రెటరీ ఎస్.వీ.ప్రసాద్ వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న జైపూర్ మండల రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా పంట భూములు లాక్కొని అన్యాయం చేయొద్దని జైపూర్ మండల రైతులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చే నామమాత్ర పరిహారంతో ఇతర చోట్ల గుంట భూమి కూడా రాదని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతోందని, రైస్‌మిల్లులు, ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి బహిరంగ మార్కెట్‌లో చెల్లించిన విధంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండలంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ముంపు గ్రామాల భూనిర్వాసితులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌కు సోలార్ పవర్ ప్లాంటు మణిహారం



పవర్ ప్లాంట్ పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

చెన్నూర్‌రూరల్: శ్రీరాంపూర్ ఏరియాకు సోలార్ పవర్ ప్లాంట్ ఒక మణిహారమని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో మూత పడ్డ గని వద్ద తుది దశకు చేరుకున్న సోలార్ పవర్ ప్లాంట్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2ఇంక్‌లైన్ గని వద్ద 76 ఎకరాల్లో 11మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని అధికారులు, ఎన్‌రిచ్ ఎర్త్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఉద్యోగస్తులందరూ రక్షణతో పని చేయాలని, రక్షణ పరికరాలు ధరించి విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోలార్ జనరల్ మేనేజర్ జానకిరామ్, ఎస్‌వో టు డైరెక్టర్ కేవీ రావు, చీఫ్ ఆఫ్ పవర్ ప్రాజెక్ట్స్ విశ్వనాథరాజు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, సోలార్ డీజీఎం శ్రీనివాస్, వర్క్‌షాప్ డీజీఎం బి.రవీందర్, ఇంజినీర్లు అభిషేక్, రాకేష్, ఎన్‌రిచ్ ఎర్త్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు



మాట్లాడుతున్న మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి

చెన్నూర్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఏడీ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీలను సందర్శించారు. అనంతరం చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. కోటపల్లి మండలం కొల్లూరులో మూడు క్వారీలు నడుస్తున్నాయని, ఆన్‌లైన్ ద్వారా ప్రతీరోజు 270 లారీల ఇసుక బుకింగ్ అవుతోందని తెలిపారు. ఇసుక క్వారీల ద్వారా ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఇటీవల జైపూర్ మండలంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో 130 ఇసుక ట్రాక్టర్ల ఇసుక డంపును పట్టుకున్నామని, ట్రాక్టర్లను సీజ్ చేశామని తెలిపారు. ఓవర్ లోడ్‌లను అరికట్టేందుకు త్వరలో చెన్నూర్ ఏరియాలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమరుస్తామని తెలిపారు.

మొక్కలు భలే చౌక

- ఐటీడీఏ ఆధ్వర్యంలో మామిడి, పూలమొక్కల విక్రయాలు
- ఉమ్మడి జిల్లాలోని నర్సరీల్లో పెంపకం
- నాలుగుచోట్ల అందుబాటులోకి..

మామిడి, పూలమొక్కలు పెంపకం ఇలా..

నర్సరీ	మామిడి	క్రోటాన్స్ /పూల మొక్కలు
బెల్లంపల్లి	10,000	1,200
భీమారం	20,000	1,500
జంబుగ	5,000	500
ఉట్నూర్	10,000	2,000


నర్సరీలో మామిడి మొక్కలు

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఆధ్వర్యంలో నర్సరీల్లో పండ్ల, పూల మొక్కల పెంపకం జరుగుతోంది. క్రోటాన్స్ ఇతర రకాల అలంకరణకు సంబంధించిన మొక్కలు పెంచుతున్నారు. ఏడాది క్రితం అంటుకట్టగా మొక్కలు ఏపుగా పెరిగింది. ప్రస్తుతం ఐటీడీఏ ఉద్యానశాఖ మొక్కల విక్రయానికి సిద్ధమైంది. ఐటీడీఏకు ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, భీమారం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగ నర్సరీలు ఉన్నాయి. ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా దశేరి, బంగెనపల్లి, తోతపురి, హిమామతి, పండ్ల రసాల మామిడి మొక్కలకు అంటు కట్టించారు. వీటికి అదనంగా మరో 5 వేల వరకు క్రోటాన్స్, అలంకరణ మొక్కలు విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

లాభాపేక్ష లేకుండా..

ప్రైవేట్ నర్సరీల్లో మామిడి మొక్కల ధరలు రైతులకు ఏమాత్రం అందుబాటులో లేవు. ఒక్కో ధర రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు. ఇతర జిల్లాల నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకురావల్సి ఉంటుంది. పైగా రవాణా ఖర్చులు అదనం. అయితే ఉమ్మడి జిల్లా రైతులకు లాభాపేక్ష లేకుండా తక్కువ ధరకు మామిడి మొక్కలు అందించాలనే సంకల్పంతో ఐటీడీఏ ఉద్యాన అధికారులు ముందుకు సాగుతున్నారు. ఒక్కో మామిడి మొక్క రూ.50 చొప్పున, కోట్రాన్స్, అలంకరణ మొక్కలు రూ.20 చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. మునగ, కరివేపాకు మొక్కలు సైతం విక్రయించనున్నారు. రైతులకు కావల్సిన ఇతర రకాల పండ్ల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించడానికి సిద్ధంగా ఉన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఐటీడీఏ తరఫున ఆయా ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీ పరిధిలో కనిష్టంగా 50 నుంచి గరిష్టంగా 150 ఎకరాల భూములు ఉన్నాయి. మామిడి, సపోటా, జామ, దానిమ్మ, అల్లనేరేడు, సీతాఫలం, నిమ్మ, రేగు, బొప్పాయి తదితర రకాల మొక్కలు పెంచి విక్రయాలు చేశారు. కాలక్రమేణా నర్సరీల నిర్వహణ గాడి తప్పడం, అధికారుల అవగాహన రాహిత్యంతో చాలామటుకు నర్సరీలు కళ తప్పి ఉన్నాయి. ప్రస్తుత ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, హార్టికల్చర్ అధికారుల చొరవతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నర్సరీల్లో ప్రస్తుత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా మళ్లీ మామిడి ఇతర రకాల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. తద్వారా నర్సరీలు పచ్చదనంతో పండ్లు, పూలమొక్కలతో కనువిందు చేస్తున్నాయి.

రైతుల ఆసక్తి

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల భూములు మామిడి తోటల పెంపకానికి ఎంతో సారవంతంగా ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో అంతగా అనువైన భూములు లేవు. అక్కడక్కడ కొద్దిపాటి ఎకరాల్లో ఔత్సాహిక రైతులు మామిడి పెంపకం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా రైతులు ఇటీవల మొక్కల కొనుగోళ్ల కోసం ఉద్యానశాఖ అధికారులను సంప్రదించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు సరఫరా చేయడానికి ఈజీఎస్ అధికారులు ముందుకు వస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోపక్క వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి మొక్కల కోసం ఆర్డర్లు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

నాణ్యతతో పెంచుతున్నాం



నర్సరీల్లో మామిడి మొక్కలు పది రకాల వరకు ఉన్నాయి. ఎంతో నాణ్యతతో వీటిని పెంచుతున్నాం. రైతుల స్పందన తర్వాతే వచ్చే ఏడాది నుంచి మరిన్ని మొక్కలు పెంచుతాం. జిల్లాల నుంచి పలువురు మొక్కల కోసం సంప్రదిస్తున్నారు. నాణ్యత మొక్కలు తక్కువ ధరకు లభిస్తుండటంతో కొనుగోలు ఆసక్తి చూపుతున్నారు.

– సందీప్‌కుమార్, ప్రాజెక్టు ఉద్యాన అధికారి, ఉట్నూర్

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం పట్టుకున్న పోలీసులు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామంలోని రాజేశ్ కిరాణం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఎదుట నిందితుడిని హాజరుపర్చినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. రేషన్ బియ్యం దందా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంపతులపై కేసు

నెన్నెల: మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన దుర్గం గంగయ్య, భారతి దంపతులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోమాస లింగయ్య, దుర్గం గంగయ్యలు భూమి విషయంలో గొడవ పడ్డారు. ఈ విషయంపై వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టగా దుర్గం దీపిక సాక్ష్యం చెప్పింది. మా మీద సాక్ష్యం ఎందుకు చెప్పావు అంటూ గంగయ్య, భారతి.. దీపికను ఇష్టం వచ్చినట్లు తిట్టి ఆమెపై దాడి చేసి చంపుతామని బెదిరించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గజ్జిగూడ గ్రామానికి చెందిన చిలుకూరు ఐశ్వర్య (14) చికిత్సపొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ కలహాలతో ఈనెల 1న తల్లి అనిత, కుమార్తెలు లక్ష్మి, రమ్య, ఐశ్వర్యలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈనెల 3న అనిత (45), కూతురు రమ్య (16), ఈనెల 6న లక్ష్మి (21) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఐశ్వర్య మృతి చెందింది. తల్లితోపాటు ముగ్గురు కూతుళ్ల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

వృత్తిశిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కంప్యూటర్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న సింగరేణి ఉద్యోగుల భార్య, పిల్లలు, భూనిర్వాసితులు, పరిసర ప్రాంత నిరుద్యోగ యువత ఈనెల 22లోగా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రోడ్లు వేయాలని 'గాంధీగిరి'

- తిర్యాణిలో ఆదివాసీ సంఘం నాయకుడి నిరసన


గాంధీ వేషధారణలో పెందూర్ ధర్ము నిరసన

తిర్యాణి(ఆసిఫాబాద్): మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించాలని ఓ ఆదివాసీ నాయకుడు మహాత్ముడి వేషధారణతో నిరసనకు దిగాడు. మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా వద్ద శుక్రవారం ఆదివాసీ సంఘం నాయకుడు పెందూర్ ధర్ము గాంధీజీ వేషధారణతో నిరసన తెలిపాడు. ఆదివాసీ యోధుడు కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాడు. అనంతరం మాట్లాడుతూ తిర్యాణి నుంచి శ్రీఇంక్లైన్ వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే గుండాల నుంచి రొంపెల్లి వరకు నూతన రోడ్డు నిర్మించాలని, మంగీ గ్రామానికి రోడ్డు వేయాలని కోరాడు. కాగా ఈ నెల 5న మండల కేంద్రానికి కలెక్టర్ వెంకటేశ్ సమీక్షా సమావేశానికి వచ్చిన సమయంలో సమస్యలు విన్నవించి కాళ్లు మొక్కేందుకు ధర్ము ప్రయత్నించిన విషయం తెలిసిందే.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆటో కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెల్ల విక్రమ్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు కట్టా రామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా ఆటో కార్మికుల యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఆటో ఓనర్స్, డ్రైవర్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కిరాయిలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆటో డ్రైవర్‌కు రూ.12 వేలు ప్రతీ నెల జీవనభృతి కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చల్ల గట్టయ్య, కలవేణి శేఖర్, పులి రాజేందర్‌గౌడ్, కలవల అంజన్న, డి.రమేశ్, తగరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏరియాలో స్టోర్స్ జీఎం పర్యటన


సన్మానిస్తున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో స్టోర్స్ (ఈఅండ్‌ఎం) జీఎం పి.ఎలిసా శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగాస్టోర్స్‌ను పరిశీలించారు. సెంట్రల్ స్క్రాబ్‌యార్డు ఏర్పాటుతోపాటు స్క్రాబ్ డిస్పోస్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. అవసరాలకు మించి స్టాక్స్ ఉంచుకోవద్దని అన్నారు. యంత్రాలు నడిచేందుకు పరిమిత స్టాక్స్‌ను నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గోలేటిలోని జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా జీఎం రవిప్రసాద్ స్టోర్స్ జీఎంను సన్మానించారు. ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, డీజీఎం స్టోర్స్ శ్రీనివాస్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, డీవైఎస్ఈ (వర్క్‌షాప్) నరేశ్, ఈఈ (సీహెచ్‌పీ) రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలి


అధికారులతో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉద్యోగుల పెండింగ్ కేసులు సత్వరం పరిష్కరించాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు పాన్‌కార్డును ఆధార్‌తో లింక్ చేసుకోని ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వెంటనే పాన్‌కార్డుకు ఆధార్ లింకు చేసుకోవాలన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యుల వివరాలు, ఫ్యామిలీ ఫొటోలు కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. ఇటీవల కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా వారికి కలిగే ప్రమాద బీమా సౌకర్యంపై అవగాహన కల్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యూటీ, పెన్షన్, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు టర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్లను త్వరగా సెటిల్ చేయాలన్నారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు రాజేశ్వరరావు, దేవేందర్ రెడ్డి, పాలకుర్తి రాజు, సునీల్, సీనియర్ పీఓ కాంతారావు, గౌస్ బాషా, రణదీప్, శంకర్ పాల్గొన్నారు.

చర్చి నిర్వాహకులపై కేసు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం బెల్లంపల్లి గ్రామాల మధ్యలో కల్వరీ మినిస్ట్రీస్ చర్చి నిర్వాహకులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రిలో కిడ్నీ సమస్యతో బాలిక (7) చికిత్స పొందుతోంది. సోమగూడెంలో చర్చి ఫాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్‌లు బాలికకు నయం చేస్తామని చెప్పి తల్లిని నమ్మించారు. బాలికను హైదరాబాద్‌లోని కల్వరీ చర్చికి గత మే16న తీసుకెళ్లింది. చర్చి మిరాకిల్ హీలింగ్‌కు షోలో ఆమెను నడిపించిన వీడియో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఆమెతో క్రూరంగా వ్యవహరించారని లీగల్ కం ప్రొబేషన్ అధికారి, డీసీపీయూ ఆర్.శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బంగారం గొలుసు అప్పగింత


స్వామిని అభినందిస్తున్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: తనకు దొరికిన బంగారం గొలుసును తిరిగి బాధితుడికి అందజేసి నిజాయితీ చాటుకున్న జీఎం కార్యాలయ ఉద్యోగి చొప్పదండి స్వామిని అధికారులు అభినందించారు. జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగంలో రాంచందర్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 11న కార్యాలయంలో తన మెడలో తులంన్నర బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. పర్సనల్ విభాగంలో పనిచేస్తున్న చొప్పదండి స్వామికి దొరికింది. రూ.లక్షన్నర విలువచేసే బంగారు గొలుసును రాంచందర్‌కు అందించాడు. జీఎం సంజీవరెడ్డి శుక్రవారం స్వామిని సత్కరించి అభినందించారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు రాజేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సునీల్ కాంతారావు పాల్గొన్నారు.

14న తైక్వాండో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో ఈనెల 14న తైక్వాండో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుచ్చి రామారావు, జి.వెంకటస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు సెల్ 9849669448 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ మంచిర్యాల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య పూర్తి చేసుకున్న ఐదుగురు విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ ఇచ్చే జాతీయ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించినట్లు ఎస్‌వో స్వప్న తెలిపారు. ఎంపీసీలో ప్రియాంక, లావణ్య, వనజ, వైష్ణవి, బైపీసీలో స్వర్ణాంజలి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఏడాదికి రూ.10 వేల చొప్పున మూడు నుంచి ఐదేళ్ల కోర్సుకు అనుగుణంగా ఇస్తారని పేర్కొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న తిప్పారపు సారయ్య

జైపూర్: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య కోరారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై ఆయన కార్మికులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం బొగ్గు గనులు వేలం వేయడం వల్ల సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు నర్సయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య


సిడాం అశోక్(ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలో డిగ్రీ విద్యార్థి సిడాం అశోక్ (23) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై కొమురయ్య కథనం ప్రకారం.. సిడాం శంకర్, యశోద దంపతుల కుమారుడు అశోక్ మంచిర్యాల పట్టణంలో డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్నిరోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించిన జీడీ ఫలితాలు రాగా.. ఎంపిక కాలేదు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్నాడు. గురువారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉన్న పాకలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అందరితో కలిసిమెలిసి ఉండే అశోక్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని చాతా గ్రామానికి చెందిన చందుల సాయులు (55) మద్యానికి బానిసయ్యాడు. బాసర మండలంలోని చౌట గ్రామంలో ఆయన అత్త గురువారం మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే భార్య, కుమారుడు అక్కడికి వెళ్లారు. చాతా గ్రామంలో ఉదయం తన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మద్యం మత్తులో ఉన్న సాయులు గుర్తుతెలియని పురుగుల మందు తాగి కిందపడిపోయాడు. ఇరుగుపొరుగు వారు గమనించి భైంసాకు తరలించారు. వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు పంపించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గడ్డిమందు తాగి యువకుడు..


సుమన్(ఫైల్)

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన యువకుడు జరుపుల సుమన్ (31) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. తాళ్లపేటలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్న సుమన్ అదే గ్రామానికి చెందిన నిజాం వద్ద డబ్బులు తీసుకున్నాడు. ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని, లేదంటే ప్లాంట్‌కు తాళం వేసి, ఆటో తీసుకెళ్తానని నిజాం అన్నాడు. దీంతో మనస్తాపం చెందిన సుమన్ గురువారం లింగాపూర్‌లోని ఇంటికి వస్తూ మధ్యలో గడ్డి మందు తాగాడు. ఇంటికి చేరుకోగానే వాంతులు చేసుకున్నాడు. ఏమైందని భార్య అడిగితే విషయం చెప్పాడు. అతన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు, అక్కడి నుంచి నిర్మల్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రీల్స్ చేస్తూ..దోపిడీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులే టార్గెట్
- నకిలీ తుపాకీతో బెదిరిస్తున్న ముఠా
- వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మరణాయుధాలతో రీల్స్ చేస్తూ..మాఫియాగా సంచరిస్తూ.. దొంగతనాలకు పాల్పడుతున్న కూలీ పని చేసుకునే ముగ్గురు యువకులను పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రానికి చెందిన అవేజ్ చాహుస్, షేక్ మతీనొద్దీన్, షేక్ ఆదిల్ స్నేహితులు. ఇన్‌స్టాగ్రాం వేదికగా చేసుకుని మతీనొద్దీన్ మాఫియా పేజీని క్రియేట్ చేశాడు. ఇతడు గతంలో మొబైల్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షేక్ ఆదిల్ హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద తుపాకీ కొనుగోలు చేశాడు. ముగ్గురు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు ముఠాగా ఏర్పడ్డారు. జన సంచారం లేని ప్రదేశంలో జంటలు, రాత్రివేళలో ఒంటరిగా వెళ్లేవారు, బస్టాండ్‌లో తలదాచుకుంటున్న వారిని నకిలీ తుపాకీతో బెదిరించి అందినకాడికి దోచుకుంటున్నారు.

స్కూటీపై వస్తూ.. పారిపోతూ..

నిర్మల్‌లోని శివాజీచౌక్ వద్ద ఎస్సై శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు స్కూటీపై వస్తూ.. పోలీసులను చూసి పారిపోయారు. అనుమానంతో వెంబడించి శ్యాంఘడ్ వద్ద అవేజ్ చాహుస్, షేక్ మతీనొద్దీన్, షేక్ ఆదిల్‌ను అదుపులో తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. వీరి వద్ద నుంచి నకిలీ తుపాకీ, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియాపై నిఘా

జిల్లాలో సోషల్ మీడియాపై 24 గంటల నిఘా పెట్టడానికి ప్రత్యేక ఐటీ సెల్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


పౌల్ట్రీ కేజీస్ అందుకున్న మహిళలు

కోటపల్లి: ఎస్సీ సబ్‌ప్లాన్ పథకాలు సద్విని యోగం చేసుకోవాలని కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త, ఎస్సీ సబ్‌ప్లాన్ నోడల్ అధికారి డాక్టర్ టీవీ ప్రసాద్ కోరారు. మల్లంపేటలోని ఎస్సీ మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం కోటపల్లి ఆధ్వర్యంలోని మహిళలకు శుక్రవారం వందశాతం సబ్సిడీతో పౌల్ట్రీ కేజీస్(కోళ్లఫామ్స్)ను అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ అన్షిదా, సబ్‌ప్లాన్ కో ఆర్డినేటర్స్ సంపత్, సునీల్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


శిరీష (ఫైల్)

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దుర్గం సుధాకర్ కుమార్తె శిరీష (20) హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కేర్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ తృతీయసంవత్సరం చదువుతుంది. గత మే నెలలో సెలవుపై ఇంటికి వచ్చింది. ఎవరికి చెప్పకుండానే గత జూన్ 25న తిరిగి హైదరాబాద్‌కు వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ దొరకలేదు. తన కుమార్తె కనిపించకపోవడానికి హైదరాబాద్‌కు చెందిన అరవింద్ కారణమని సుధాకర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదో రోజుకు దీక్షలు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయి. శుక్రవారం ఈ దీక్షలను యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య ప్రారంభించారు. తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. కేంద్రం దిగివచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నగేశ్, నాయకులు మిరియాల రాజేశ్వరరావు, ఫిట్ సెక్రటరీలు సంఘం సదానందం, రాంచందర్, నాగేశ్వరరావు, మొగిలి లక్ష్మణ్, రామచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.20 లక్షల బీమా

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.20 లక్షల ప్రమాద బీమాకు బ్యాంకర్లతో ఒప్పందం జరిగిందని ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. శుక్రవారం గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుడు విధి నిర్వహణల్లో గాని, బయట గాని ప్రమాదంలో మృతి చెందితే ప్రమాద బీమా కింద రూ. 20 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. దీనికి గాను కాంట్రాక్టు ఉద్యోగులందరూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా తెరవాలని సూచించారు. గని రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, సర్వే అధికారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు పాటించాలి

మందమర్రిరూరల్: ఏరియాలోని గనుల్లో పనిప్రదేశాల్లో ఉద్యోగులు రక్షణ సూత్రాలు పాటించాలని హైదరాబాద్ రీజియన్-2 మైనింగ్ డీఎంఎస్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని ఎల్లందు క్లబ్ ఆవరణలో బెల్లంపల్లి రీజియన్ స్థాయి గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలో మన సేఫ్టీ, మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏరియా జీఎం మనోహర్, జీఎం సేఫ్టీ (కార్పొరేట్) గురవయ్య, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి జీఎం రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.